క్లుప్తంగా

సమస్యలకు సత్వర పరిష్కారం



దివ్యాంగుడు కృష్ణారెడ్డితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: తన వద్దకు వచ్చిన వృద్ధులు, వికలాంగులను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అక్కున చేర్చుకొని ఆప్యాయంగా పలకరించి సమస్యలకు పరిష్కారం చూపారు. గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులు, వికలాంగులు వివిధ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారి సమస్యలను ఓపికగా విన్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి



ఎంఈఓ చెన్నకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని చైతన్య పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని మండల విద్యాధికారి చెన్నకృష్ణకు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో 8వ తరగతి ప్రవేశాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖాధికారులు వెంటనే పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాబ్జాన్, ఉపేంద్ర, విజయ్‌కుమార్, యశ్వంత్, తరుణ పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ భేష్



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ధర్మవరం: ఇటీవల బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ శ్రీనివాసులు గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పీఎస్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కేసులను పరిష్కరించాలని పట్టణ సీఐ సుబ్రమణ్యంను ఆదేశించారు. పట్టణ పీఎస్‌లో రికార్డుల నిర్వహణ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.

సమయపాలన తప్పనిసరి



మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ శుభదాస్

తనకల్లు: మండల పరిధిలోని బాలసముద్రం, తనకల్లు-1 గ్రామ సచివాలయాలను మండల ప్రత్యేకాధికారి శుభదాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు సమయపాలనతో పాటు డ్రస్ కోడ్ పాటించాలన్నారు. వివిధ సమస్యలతో వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్థానిక ఉర్దూ, నల్లగుట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. 30 పడకల ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూల నరసింహులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు మద్దతివ్వండి

- ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు
- రానున్న రోజుల్లో మరింత సంక్షేమం
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కేతిరెడ్డి, పీవీ సిద్దారెడ్డి



ధర్మవరం: 22వ వార్డులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి



కదిరి అర్బన్: వృద్ధురాలిని పలకరిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

ధర్మవరం: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ ప్రజారంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక 22వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వార్డులో ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పలువురు వార్డు ప్రజలు వార్డులో విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలు షాక్ కొడుతున్నాయని తెలిపారు. మరికొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయని చెప్పారు. ఇందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి స్పందిస్తూ.. వార్డులో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను తొలగించి.. కొత్త వాటిని ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. వార్డులో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడం జరుగుతోందన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వలంటీర్ల ద్వారా ప్రజల ఇళ్ల వద్దకు సంక్షేమ పథకాలను అందించడం జరుగుతోందన్నారు. ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణ సౌకర్యం కల్పించడం జరుగుతోందన్నారు. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం అందించడంతో పాటు అభివృద్ధి పనులు సమానంగా చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, వార్డు కౌన్సిలర్ చౌడం సుబ్బలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గత పాలకులు రాబందులు

కదిరి అర్బన్: గత పాలకులు రాబందుల్లా ప్రజలను పీక్కుతిన్నారని ఎమ్మెల్యే డా. పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కే.బ్రాహ్మణపల్లి సచివాలయం పరిధిలో వీరచిన్నయ్యగారిపల్లి, దిన్నెమీదపల్లి, కుమ్మరోళ్లపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు ఒక్కో పథకానికి ఒక రేటు నిర్ణయించి ప్రజలను రాబందుల్లా పీక్కుతిన్నారన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. తమ పార్టీ అంతిమ లక్ష్యం ప్రజా సంక్షేమం అన్నారు. ప్రజలకు మేలు చేసేందుకు ఎంతటి కష్టమైనా భరిస్తామన్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా కూడా సంక్షేమాన్ని ఎన్నడూ ఆపలేదన్నారు. నూతనంగా సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు రావాలంటే మన పార్టీని మళ్లీ గెలిపించుకోవాలన్నారు.

వైఎస్సార్ యంత్రసేవ రైతులకు వరం

వీరచిన్నయగారిపల్లిలో వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద నూతన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ఒక కస్టమ హైరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. అనంతరం తమ గ్రామంలో మిగిలిపోయిన చోట్ల సీసీ రోడ్లు వేయించాలని వీరచిన్నయగారిపల్లి, కుమ్మరోళ్లపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. అలాగే కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. వెంటనే విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మరికొందరు భూములకు పట్టాలిప్పించాలని విన్నవించారు. పట్టాలు ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, ఎంపీపీ అమరనాథ్ రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, నాయకులు మధుసూధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు, ఖుర్షిద్, ఈశ్వరయ్య, గరుడప్ప, బాబ్జాన్, బ్రహ్మానందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రసాద్, జైనుల్లా, వెంకటరమణారెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని బేరిపల్లి క్వాటర్స్ వార్డు సచివాలయం, 16వ వార్డు పరిధిలోని నాగిరెడ్డిపల్లి నుంచి శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొనే కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మెన్లు, కౌన్సిలర్లు, అధికారులు నాయకులు పాల్గొనాలని స్థానిక నాయకులు కోరారు.

పరామర్శ

కదిరి అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఫర్హానా ఫయాజ్ భర్త వేమల ఫయాజ్‌ను గురువారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పరికి సాధిక్, పలువురు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

ఓడీ చెరువు: రైతులు సకాలంలో తమ పంట రుణాలను సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రహల్లాద్ రెడ్డి గురువారం తెలిపారు. ఏపీజీబీలో పంట రుణాలు పొందిన రైతులు ఏడాదిలోపు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే 3 శాతం వడ్డీ మాఫీకి అర్హులు అవుతారన్నారు. రుణాలను రెన్యూవల్ చేసుకుని ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు వాహనాల వేలం

తలుపుల: వివిధ కేసుల్లో పట్టుబడిన 5 ద్విచక్ర వాహనాలు, 1 కారును స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు ఎస్ఐ మగ్బుల్ బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

మెరుగైన సేవలతోనే గుర్తింపు



హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పోలప్ప

ఓడీ చెరువు: ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిలో అర్హులకు న్యాయం జరిగేలా పని చేయాలని ఎంపీడీఓ పోలప్ప అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1, 2లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగుల పనితీరుపై సమీక్షించారు. వివిధ పనులపై వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అర్హులందరికీ న్యాయం జరిగేలా చూడటం మన బాధ్యత అని గుర్తు చేశారు. అప్పుడే మనం చేసే వృత్తిలో మనం సంతృప్తి పొందుతామన్నారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రామలింగారెడ్డి, సిబ్బంది మదన్ మోహన్‌రెడ్డి, బాషా, హరీష్, తేజశ్విని పాల్గొన్నారు.

డ్రిప్పు పరికరాలకు నిప్పు



కాలిపోయిన డ్రిప్పు వైరు, పైపులు

కనగానపల్లి: మండల కేంద్రానికి సమీపంలోని వ్యవసాయ పొలంలోని డ్రిప్పు పరికరాలకు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం నిప్పు పెట్టారు. దీంతో 20 కట్టల డ్రిప్పు వైరు, పైపులు కాలిపోయాయి. దీంతో రూ.60 వేల దాకా నష్టపోయినట్లు బాధిత రైతు వి. ముత్యాలు తెలిపారు. ఈ మధ్యనే మొక్కజొన్న పంట కోసి, పొలంలోనే డ్రిప్పు పరికరాలు వేశామని, పొలానికి సమీపంలోని చెత్తకు ఎవరో నిప్పు పెట్టారన్నారు.

గడువులోపు పనులు పూర్తి చేయాలి

బత్తలపల్లి: ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మనబడి నాడు-నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్‌జాన్‌ను పనుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. తమ పాఠశాలలో అదనపు తరగతి భవన నిర్మాణం పనులు జరుగుతున్నాయని, గత నాలుగు రోజుల క్రితం స్లాబ్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. నాడు-నేడు పథకం కింద భవన నిర్మాణాలకు మంజూరైన మొత్తం ఖర్చు చేసిన వివరాలపై ఆరా తీశారు. మండల వ్యాప్తంగా పలు పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను గడువులోపు పూర్తి చేయించేలా చూడాలని ఎంఈఓ చాముండేశ్వరిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సహాయకులు గాయత్రి, సీఆర్పీలు సునీత, వెంకటరమణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ తనిఖీ

బత్తలపల్లి: మండల కేంద్రంలోని జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను గురువారం ఎంపీడీఓ శ్రీదేవి తనిఖీ చేశారు. ఎంఈఓ చాముండేశ్వరితో కలిసి స్టాక్ పాయింట్‌లో నిల్వ ఉన్న పాఠ్యపుస్తకాలు, డిక్షనరీలను పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా పుస్తకాలు వచ్చాయా? బెల్టులు కొలతల మేరకు వచ్చాయా? లేదా? అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ గాయత్రి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞానానికి నిలయాలు

తలుపుల: గ్రంథాలయాలను పాఠకులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ అన్నారు. గురువారం ఆమె స్థానిక గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలో వివిధ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులను వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీసోర్స్‌పర్సన్ విశ్వనాథ్ విద్యార్థులకు ఇంగ్లిష్ గ్లామర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కమలమ్మ పాల్గొన్నారు.

గాండ్లపెంట: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పిల్లలతో కథలు చదివించారు. శిక్షణలో ఏం నేర్చుకున్నారని అడిగి తెలుసుకున్నారు. శిక్షణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి పరియాబాను పాల్గొన్నారు.



వేసవి విజ్ఞాన శిబిరాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

ముదిగుబ్బ: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ తనిఖీ చేశారు. స్పోకన్ ఇంగ్లిష్, క్యారమ్స్, చదరంగం తదితర వాటిని పరిశీలించారు. బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మూడే బొజ్జేనాయక్, ఉపాధ్యాయులు నాగరాజు నాయక్, సిబ్బంది ఖాదర్ బాషా పాల్గొన్నారు.

21న గొడ్డువెలగలలో దేవర ఎద్దుల వేల్పు

గాండ్లపెంట: మండల పరిధిలోని గొడ్డువెలగల గ్రామ సమీపంలో దేవర ఎద్దుల వేల్పును ఈనెల 21న ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కదిరి నియోజకవర్గంలోని గాండ్లపెంట మండలం కోటూరు, నల్లచెరువు మండలం చెరువువాండ్లపల్లి, తనకల్లు మండలం చిన్నపల్లి, కదిరి రూరల్ మండలంలోని బాలప్పగారిపల్లి, కుటాగుళ్ల, దిగువపల్లి, తలుపుల మండలంలోని ఈదుల కుంట్లపల్లి, ఓనయ్యగారిపల్లి గ్రామాల నుంచి దేవర ఎద్దులు వేల్పుకు రానున్నట్లు చెప్పారు. వేల్పుకు వచ్చే వారి కోసం సూరగాని సుమతి, వి.శ్రీనివాసులు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

జల జాగరణ దీక్ష విజయవంతం చేయాలి

పుట్టపర్తి: ఈనెల 31నుంచి రెండు రోజుల పాటు నంద్యాల జిల్లా సంగమేశ్వరంలో జరుగు సిద్ధేశ్వరం జల జాగరణ దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సాయిఆరామంలో పెద్దారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ లోచర్ల విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి సాధించడంలో ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ పార్టీలు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రమణారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు రుషీకేశవ రెడ్డి, జిల్లా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు కన్యాకుమారి, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, మురళీధర్‌రెడ్డి, తిరుపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

పరిహారం అందేలా చూడాలని వినతి




తహసీల్దార్ యుగేశ్వరిదేవికి వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారి నిర్మాణానికి భూములు కోల్పోయిన తమకు సంవత్సరాలు గడుస్తున్నా పరిహారం అందలేదని తహసీల్దార్ యుగేశ్వరి దేవికి పలువురు బాధిత రైతులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2018 సంవత్సరంలో రాప్తాడు నుంచి బత్తలపల్లి వరకు నాలుగు వరుసల రహదారి నిర్మించారన్నారు. సుమారు రెండు ఎకరాల 53 సెంట్ల భూమికి సంబంధించి నేటికీ పరిహారం అందలేదన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. రెండు ఎకరాల 53 సెంట్లు భూమికి పరిహారం మంజూరయ్యే లిస్టులో పొరపాటు జరిగిందని తెలిపారు. జాతీయ రహదారుల అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లామని చెప్పినట్లు పేర్కొన్నారు. అయినా నేటికి పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం విడుదల చేయకపోతే వాహనాలు తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

అమడగూరు: ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. పథకాల్లో ముఖ్యంగా అర్హులందరికీ ఇళ్లను మంజూరు చేయాలన్నారు. అలాగే నిర్మాణాలకు ఎప్పటికప్పుడు బిల్లులు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను నాణ్యతగా చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తయ్యేలా చూసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్యను పెంచేలా ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వలసలు వెళ్లకుండా అరికట్టాల్సిన భాద్యత అధికారులపై ఉందన్నారు. అలాగే మిగిలిన అన్ని శాఖల అధికారులతో ప్రస్తుతం జరుగుతున్న వాటి గురించి తెలియజేశారు. మండల వ్యాప్తంగా ఎలాంటి సమస్య వచ్చిన తన దృష్టికి తెస్తే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిద్దామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నసీమా, ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప, వైద్యాధికారి మోనా, ఇతర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: గత ఏడాదిలో ఉపాధి పథకం కింద జరిగిన పనులపై త్వరలో ఆడిట్ జరుగునున్న సందర్భంగా గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బుక్కపట్నం సర్పంచ్ నాగలక్ష్మమ్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఉపాధి పథకంలో ఉపయోగకరంగా ఉండే పనులను చేపట్టాలని సూచించారు. ఉపాధి పనులను పారదర్శకంగా ఆడిట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ నాయకుడు గోవర్దన్‌రెడ్డి, ఉపాధి ఏపీఓ రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

కొత్తచెరువు: మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన కాయలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ నటరాజ్ తెలిపారు. 29వ తేదీ నుంచి విత్తనకాయల పంపిణీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఎన్పీకుంట: రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేయాలని ఎంపీపీ ఈటి రాము వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఎన్.పీ.కుంట-1 రైతు భరోసా కేంద్రానికి చేరిన విత్తన వేరుశనగ కాయల నాణ్యతను ఎంపీడీఓ ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. మండలంలోని 10 ఆర్బీకేల పరిధిలో 3,248 క్వింటాళ్ల విత్తన వేరుశనగను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే 360 క్వింటాళ్ల విత్తన కాయలు ఆయా ఆర్బీకేలకు చేరాయని తెలిపారు. నాసిరకం విత్తనకాయలు వస్తే వాటిని రిటర్న్ చేయాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, స్థానిక సర్పంచ్ అంజినమ్మ, ఎంపీటీసీ మగ్బూల్‌బీ, కో-ఆప్షన్ సభ్యుడు సుబహాన్, ఏఈఓ శిరీష, వీఏఏలు యుగంధర్, ఇంతియాజ్, నరసింహారెడ్డి, ఆంజినాయక్, రైతులు మల్లిరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

నాయనపల్లిలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు

తాడిమర్రి: మండలంలోని నాయనపల్లి గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీ ధరణిబాయి 104 వాహన సిబ్బందితో కలసి పర్యటించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, కోడిగుడ్లు, చేపలు, మాంసం తదితర పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలని సూచించారు. కాన్పు కోసం 108 వాహన సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బాలరాణి, ఆరోగ్య కార్యకర్త వెంకటరాముడు పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: ఐసీడీఎస్ పరిధిలోని శిశుగృహలో కాంట్రాక్టు ప్రాతిపదికన రెండు ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు ఈనెల 20న కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

చారిత్రక సంపదను కాపాడుకుందాం

అనంతపురం కల్చరల్: జిల్లాలో ఎంతో అద్భుతమైన చారిత్రక వారసత్వ సంపద ఉందని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పురావస్తు శాఖ ఏడీ రజిత అన్నారు. గురువారం మ్యూజియం దినోత్సవ వేడుకలు స్థానిక పీస్ మెమోరియల్ హాలులో ఘనంగా నిర్వహించారు. పురావస్తు శాఖ, ఇంటాక్, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్ అధ్యక్షత వహించారు. ఏడీ రజిత, పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, చార్టెడ్ అకౌంటెంట్ వేణుగోపాలరెడ్డి, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ, వినియోగదారుల సంఘం రవీంద్రనాథ్ రెడ్డి, రెడ్డి జనసంఘ్ కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇంటాక్ కో కన్వీనర్ చంద్రహాసరెడ్డి తదితరులు హాజరై మాట్లాడారు. అంతకు ముందు గాయకుడు సాధుశేఖర్ ఆలపించిన గీతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో లెక్చరర్ పద్మావతి, సాహితీవేత్తలు రియాజుద్దీన్, నబీ రసూల్, షరీఫ్, సూర్యనారాయణ రెడ్డి, గుప్తా, మాసూంబాబా తదితరులు పాల్గొన్నారు.